ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 14
సంచిక : 07
పేజీలు : 5 వెల రూ. 2/-
గురువారం
04 జూన్ 2026
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

- నెహ్రూ రికార్డుకు మోడీ బ్రేక్



2 లో

# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

- టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం
- యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్
- ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనండి
- దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ



2 లో

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

- రాష్ట్ర ఏర్పాటుతో 11 రోజులు అనసం తినలేదన్నావ్
- మా ఇంటికి వస్తే సోదరుడిగా ఆదరిస్తా.. బిర్యానీ పెడతా
- మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా
- పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక

2 లో



## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

- జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు
- మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి



2 లో

## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్, రేవంత్ రెడ్డి..

2 లో



## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు
- ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:



తెలంగాణ, జర్మనీలోని తురంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:

తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:

తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం

**తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక**

**ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు**

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

**కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను**

**తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే**

**మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:

వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్షరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

## హరీష్‌తో జాగ్రత్త కెటిఆర్

**బిఆర్ఎస్ పార్టీలో నాయకత్వ సమస్య ఉంది**

**ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు**

ఏఎం న్యూస్, హైదరాబాద్,జూన్3:

మాజీ మంత్రి హరీష్‌రావుతో రాజకీయంగా ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ హెచ్చరించారు. సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. హరీష్ రావుతో కేటీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్‌లో నాయకత్వ సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం : నితిన్ నబీన్

ఏ ఎం న్యూస్, న్యూఢిల్లీ, జూన్ 3:




తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు అందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో గల అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రెసిడెంట్స్ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ నబీన్ మాట్లాడుతూ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు బీజేపీ ఎప్పటి నుంచో మద్దతుదారుగా ఉందన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో అందించిన సంపూర్ణ మద్దతు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ జీ, ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ సభ్యుడు పెరిక సురేష్, ఎన్వీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెరిక సురేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం న్యూఢిల్లీలో ఇంత భారీ స్థాయిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం నితిన్ నబీన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, రాష్ట్ర సాధనలో ప్రముఖుల పాత్రను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకలు ఢిల్లీలోని తెలంగాణ వాసుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి.

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,జూన్3:

దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

ఏఎం న్యూస్, బెంగళూరు,జూన్ 3:



కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ

ఏఎం న్యూస్, న్యూఢిల్లీ,జూన్3:

నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ నెల 10న ఇండియాకు అత్యధిక కాలం పని చేసిన ప్రధానిగా నిలవబోతున్నారు. అది కూడా ఎన్నికల్లో గెలిచి, అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూను దాటేయబోతున్నారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ మే 13, 1952న పదవీ బాధ్యతలు చేపట్టారు. మే 27, 1964న ఆయన మరణించేవరకు ప్రధానిగానే ఉన్నారు. అలా మొత్తం 4,398 రోజులు ప్రధానిగా కొనసాగారు. ఇంతకాలం పదిలంగా ఉన్న ఈ రికార్డును మోదీ జూన్ 10న చెరిపేయబోతున్నారు. ఈ నెల 10తో మోదీ ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుంటారు. మోదీ మొదటిసారిగా మే 26, 2014న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆయన ప్రధానిగా కొనసాగుతున్నారు. మోదీ ఇంతకుముందు కూడా ప్రధానిగా మరో రికార్డును బద్దలుకొట్టారు. వరుసగా, అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ రికార్డును జూలై 5, 2025న దాటేశారు. ఇందిరాగాంధీ జనవరి 24, 1966న ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి, వరుసగా 4,077 రోజులపాటు కొనసాగారు. ఆమె మార్చి 24, 1977లో వరకు ప్రధానిగా కొనసాగారు. అలా, ఇందిరా గాంధీ కంటే ఎక్కువ రోజులు వరుసగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోదీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా. ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951?52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీచేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి. దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది.

# ఆల్విన్ కాలనీ డివిజన్లో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు సాయశక్తుల కృషి

## – మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలో ఎల్లమ్మ చెరువు మహంకాళి నగర్ పెట్రోల్ బంక్ వద్ద మ్యాన్ హోల్స్ నుండి వరద నీరు పొంగి రోడ్డు మీద ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం రాత్రి బుధవారం రోజు కూడా జల మండలి ఉన్నతధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ నీటి పారుదల, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీ పైప్ లైన్ ధ్వంసమై సమస్య మొదలైందని, గత వారం రోజుల నుండి ప్రజల ఇబ్బందులను గుర్తించి పలుమార్లు సందర్శించి, నివారణ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. సమస్యను పరిష్కరించడానికి శేరిలింగంపల్లి శాసన సభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీతో, అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులు చేస్తున్నామని తెలియచేసారు. అధికారులతో కలిసి అక్కడే ఉండి ఎల్లమ్మ చెరువు వద్ద నీటి పారుదల పైప్ లైన్ నిర్మాణ పనులలో భాగంగా గతంలో తవ్విన గుంతలో జమైన నీటిని మోటార్ సహాయంతో తొలగించి సమస్యను పరిష్కరించామని తెలియచేసారు. వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్మయంతో కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు ఎదురవ్వకుండా చూడాలని అన్నారు. ఉషముళ్ళ పూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున కొన్ని ఇబ్బందులు కూడా ఎదురవ్వుతు న్నాయని వాటిని ప్రజలు అర్థం చేసుకుని నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు ఓపికతో ఉండాలని, రోడ్డు విస్తరణ జరిగితే మన ఎల్లమ్మబండ ప్రధాన రహదారి ట్రాఫిక్ కష్టాలు తొలగి ప్రయాణం సాఫీగా సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జల మండలి సైబరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, డైరెక్టర్ నారాయణ, కూకట్పల్లి జోన్ జీఎం హరి శంకర్, డిజిఎం శ్రీనివాస్ రాజు. నాయకులు పాండు గౌడ్, పోశెట్టి గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, మరెళ్ల శ్రీనివాస్, షౌకత్ అలీ మున్నా, గుడ్ల శ్రీనివాస్, అంజయ్య యాదవ్, ఖలీమ్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్న ఉత్తమ విద్యార్థినికి బ్రహ్మప్ప దామోదర్ రావు నగదు ప్రోత్సాహం అందజేత



ఏ ఎం న్యూస్, కూకట్పల్లి : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణలో ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉద్దేశంతో తెలంగాణ ఉద్యమకారుడు, కూకట్పల్లికి చెందిన బ్రహ్మప్ప గారి దామోదర్ రావు కొంతమంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. కూకట్పల్లి ఏడీఆర్ సెంటర్ వద్ద ప్రైవేట్ గా పని చేస్తూ గ్రూప్స్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న శ్రీలతకు బుధవారం నగదు పురస్కారం అందజేసి ప్రోత్సహించారు. భవిష్యత్తులో చదువు విషయంలో ఎలాంటి అవసరం ఉన్న తనను సంప్రదించాలని ఆమెకు తెలిపారు. బంగారు భవిష్యత్తు ద్వారా బంగారు తెలంగాణను రూపుదిద్దుకోవడంలో యువతరందే కీలక పాత్ర ఉంటుందని ఆయన తెలిపారు. శ్రీలత భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలకు చేరాలని దామోదర్ రావు ఆకాంక్షించారు.

## సిగ్నల్ వ్యవస్థను సరి చేయండి : వివిధ రాజకీయ పార్టీల నేతలు

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



తెల్లాపూర్ (డివిజన్)నుండి బిహెచ్ఎల్ ఎంఐజిలోకి వెళ్లడానికి అండర్ అండర్ పార్ట్ దగ్గర సిగ్నల్స్ పనిచేయడం లేదు అని ,దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు గురవుతున్నారు అని,కొద్ది రోజులలో స్కూలు ప్రారంభమవుతాయి ట్రాఫిక్ ఇబ్బంది వల్ల ఉద్యోగస్తులు విద్యార్థులు సమయానికి ఆఫీసులో స్కూళ్లకు వెళ్లలేరు కావున వెంటనే సిగ్నల్ వ్యవస్థను సరిచేయాలని డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు వివిధ రాజకీయ పార్టీల నేతలు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నేతలులో మల్లేపల్లి బుచ్చిరెడ్డి (పిఎసిఎస్సి చైర్మన్)తో పాటు మాజీ కౌన్సిలర్లు లచ్చి రామ్ నాయక్ శంషాబాద్ రాజు, సీఎన్వి బాలాజీతో పాటు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి నువ్వు కలసి మెమోరండం సమర్పించారు.

## శ్రీరామ ఆటో యూనియన్ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నల్ల మాస శ్రీనివాస్ గౌడ్

ఏ ఎం న్యూస్, ఓయూ :



యాదగిరిగుట్ట కొండపైకి నడిచే ఆటో సంఘం, జై శ్రీరామ ఆటో యూనియన్ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నల్ల మాస శ్రీనివాస్ గౌడ్‌ని, ఆటో కార్మికులు ఎన్నుకోవడం జరిగింది ,అధ్యక్షుని కు ,ఇతర సంఘాల నుండి సన్మానం జరిగింది ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని తెలియజేశారు, గౌరవ అధ్యక్షుడు గుండు నరసింహ, ఎస్ ఎల్ ఎన్ ఎస్ అధ్యక్షులు ,గుండు సాయిలు,, యాదాద్రి ఆటో యూనియన్ అధ్యక్షుడు అరిసెల నాగరాజు, వై ఎల్ ఎన్ ఎస్ అధ్యక్షుడు, గడ్డమీది దేవేందర్ గౌడ్, ఆది జాంబవ అధ్యక్షుడు, బాకీ మొగులయ్య, ఏ ఐ యు టి సి, కళ్లెం సిద్ధులు, యాద ఋషి అధ్యక్షుడు కంసాని శ్రీహరి, ఎస్ ఎల్ ఎన్ ఎస్ టు అధ్యక్షుడు రాంపల్లి రజనీకాంత్, సూదగాని కృష్ణ, మానుపాటి ప్రసాద్, కృష్ణ స్వామి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అభిమానాన్ని చాటుకున్న విజయ్..



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : ఒకప్పుడు తమ అభిమానాన్ని సినిమాలు విజయవంతమైనప్పుడు వారి హీరోకి సంబంధించిన ముఖచిత్రాన్ని ఐరన్, చెంబు ఇస్త్రీ లాంటి పద్ధతుల ద్వారా వారు వేసుకునే చొక్కా మీద ముద్రించుకొని తమ అభిమానాన్ని చాటి చెప్పేవారు. ప్రస్తుతానికి విషయానికొస్తే విలేఖరిగా తన జీవితాన్ని ప్రారంభించిన విజయ్ కాలక్రమేనా జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ (ప్రస్తుతం మాజీ) సిఎన్ రెడ్డి కార్యకలాపాలు చూసే పర్సనల్ అసిస్టెంట్ గా బాధ్యతలు స్వీకరించారు. బుధవారం (3/6/2026) పుట్టినరోజు జరుపుకుంటున్న, తను అభిమానించే, మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి కి తన అభిమానాన్ని తెలిపే విధంగా తన తెల్ల చొక్కా మీద సిఎన్ఆర్ చిత్రపటం ఉన్న లోగోని ముద్రించి తన అభిమానాన్ని చాటారు. సిఎన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు వచ్చిన ప్రతి ఒక్కరూ విజయ్ షర్టు మీద ఉన్న ఈ చిత్రం( సిఎన్ఆర్)చూసి ఆశ్చర్య చకితులయ్యారు. ఏది ఏమైనా ఈ పుట్టినరోజు వేడుకలలో విజయ్ తన తెల్ల చొక్కా మీద ముద్రించుకున్న ఈ చిత్రం ( సిఎన్ఆర్) ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది అని చెప్పవచ్చు.

# అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంది

## - ఫేస్ 1 వాసులు..



ఏ ఎం న్యూస్, పటాన్చెరు : సమస్య ను పట్టించుకోవాలని సంబంధిత అధికారులకు వద్దకి వినతి పత్రం సమర్పించడం జరిగింది. వారు వచ్చి చూసి వెళ్లడం జరిగింది. చివరికి వారి పై అధికారుల ఆదేశాలు వస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కాలయాపన చేస్తూ సమస్యని జటిలం చేస్తున్నారు. సరే విషయానికొస్తే సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసి లో కలిసిన తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1 లో ప్రాంగణంలోని (మెయిన్ గేట్ ప్రాంగణం) డ్రైనేజీ కి సంబంధించిన మ్యాన్ హోల్ నుంచి మురుగునీరు వరదల పారుతూ (ఒకసారి కొంచెం, ఒకసారి ఎక్కువ) ఉరకలెత్తుతుంది. ఈ ఉరకలు ఎత్తిన ప్రవాహం నుంచి వచ్చిన మురుగునీరు కి ఎదురుగా ఉన్న బ్లాకుల వాసులు, మెయిన్ గేట్ నుండి తమ బ్లాకులకు వెళ్తున్న లబ్ధిదారులకు, చాలా ఇబ్బందిగా మారింది. గుడికి వెళ్దాం అన్న అదే దారి ,బడికి వెళ్దాం అన్నా అదే దారి, బస్సు ఎక్కాలి అన్న అదే దారి, బస్సు దిగి ఇంట్లోకి రావాలన్న అదే దారి నుండి వస్తున్న ఫేస్ 1 లోని వాసులకు అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉంది అని కాలనీలోని డాక్టర్లు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను జటిలం కాకుండా సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు కొల్లూరు డబల్ బెడ్ రూమ్ ఫేస్ 1 లోనివాసులు. ముఖ్యంగా వారం రోజులలో ( జూన్ నెల(2026) 10 వ తారీకు) స్కూల్ లు మొదలవుతున్నాయి. విద్యార్థిని విద్యార్థులు బస్సు దిగి ఈ దారి గుండా వెళ్తూ అంటూ రాగాలు తెచ్చుకుంటే బాధ్యత ఎవరిది అని ప్రశ్నిస్తున్నారు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల తో పాటు ఫేస్ 1 వాసులు.

# సనత్ నగర్‌లో బీఆర్ఎస్ బలహీనపడింది..

## – తలసాని పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు: మర్రి పురురవ రెడ్డి



ఏ ఎం న్యూస్ / హైదరాబాద్ : సనత్ నగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గతంతో పోలిస్తే మరింత బలపడిందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో బీజేపీ జెండా ఎగురవేస్తుందని రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల బేగంపేట్ డివిజన్ బీజేపీ మహిళా నాయకురాలు సంధ్య లక్ష్మి తల్లి సరోజ మృతి చెందిన విషయం తెలుసుకున్న మర్రి పురురవ రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి బుధవారం మధ్యాహ్నం బేగంపేట్‌లోని వారి నివాసానికి వెళ్లి సంధ్య లక్ష్మిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సరోజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత అక్కడి మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మర్రి పురురవ రెడ్డి, సనత్ నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల అవినీతి కార్యకలాపాల కారణంగా ఆ పార్టీ బలహీనపడిందని ఆరోపించారు. డివిజన్ స్థాయిలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు, అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలు బీఆర్ఎస్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులన్నీ తెలిసినా, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పైకి మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మర్రి పురురవ రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇ. దయానంద్, జి. అశోక్ కుమార్, సి. విజయ్ కుమార్, నక్క శ్రీనివాస్ గౌడ్, ఆకుల మహేష్, క్రాంతి కుమార్, మహేష్ కుమార్ ముదిరాజ్, టి. వెంకటేశ్ యాదవ్, ఎం. నగేష్, ఎన్. మహేష్, చంద్రశేఖర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.





## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన టిపిసిసి జనరల్ సెక్రటరీ (ఎస్సీ డిపార్ట్మెంట్) ఎస్.శివశంకర్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



టీపిసిసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎస్సీ డిపార్ట్మెంట్ పదవి బాధ్యతలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ కి చెందిన ఎస్ .శివశంకర్ నియమితులయ్యారు. ఈ పదవి బాధ్యత వచ్చినందున బుధవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి తనకిచ్చిన ఈ పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తానని, కాంగ్రెస్ పార్టీకి పేరు తెచ్చే విధంగా, ఎస్సీ 59 కులాల అభివృద్ధికి పాటుపడతానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తనకు తెలియపరిస్తే ఆ సమస్యను పరిష్కరించే విధంగా నా ప్రయత్నం ఉంటుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ కు తెలిపారు శివశంకర్. బీసీ జేఏసీ చైర్మన్ వి. చిన్న శ్రీశైలం యాదవ్‌ని మర్యాదపూర్వ కలిశారు ఎస్ శివశంకర్. తనకు పదవి వచ్చినందున ఎమ్మెల్యే తమ్ముడు వెంకట్ యాదవ్‌తో పాటు మహేందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు అని శివ శంకర్ వెల్లడించారు. సాయి రూపేష్, లింగం, నాగేష్, యశ్వంత్ కుమార్ లు తనకు శుభాకాంక్షలు తెలిపారని, నా కష్టానికి తగిన ఫలితమే కాంగ్రెస్ పార్టీ నాకు ఇచ్చిన ఈ పదవి అని, ఈ పదవి నాకు బాధ్యతను పెంచిందని అన్నారు.

## వెంకట్ మిల్లెట్స్, జ్యూసెస్ షాప్ 3వ శాఖని ఘనంగా ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే..



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : మధురానగర్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) డి 121 షాప్ నెంబర్ 5, శ్రీనివాస అపార్ట్మెంట్ అమీర్పేట్ 500038 చిరునామాలో వెంకట్ మిల్లెట్స్ జ్యూసెస్ షాపును నిర్వాహకుల పిలుపుమేరకు ముఖ్యఅతిథిగా పాల్గొని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి శాలువాతో ఘనంగా సన్మానించారు షాప్ నిర్వాహకులు వెంకట్, ప్రవళిక దంపతులు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్యానికి ఉపయోగపడే ఆహారాన్ని అందించే మిల్లెట్స్ లాంటి షాపుని ఏర్పాటు చేసిన వెంకట్‌ని అభినందిస్తున్నాను అని అన్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ మా అమ్మ (పి.సుజాత) నాన్న (పి.వెంకట్) ఆశీర్వాదం వల్లనే నేను మూడో బ్రాంచ్ ని ప్రారంభిస్తున్నానని వెంకట్ తెలిపారు. మేము పిలువగానే వచ్చి మమ్మల్ని ఆశీర్వదించి మా షాపుని ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని వెంకట్ అన్నారు. నా చెల్లెలు సపోర్ట్ నాకు ఎంతో ఉందని వెంకట్ తెలిపారు. మేము మొదట ప్రారంభించిన బంజారాహిల్స్ లోని కె.బి.ఆర్ పార్కు వద్ద ఆహార ప్రియుల మెప్పు పొందింది అని అన్నారు.

## రాజేశ్వర్ రెడ్డి పుట్టినరోజు ఘనంగా జరిపిన కొల్లూరు ఫేస్ 1 వాసులు

ఏ ఎం న్యూస్, పటాన్చెరు :



పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య, వారి మిత్రుల మధ్య, శ్రేయోభిలాషుల మధ్య జరుపుకుంటారు. విషయానికొస్తే సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం పటాన్చెరు నియోజకవర్గం నూతనంగా జిహెచ్ఎంసిలో కలిసిన తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు డబల్ బెడ్ రూమ్ (రెండు పడకల సముదాయం) ఫేస్ 1 లోని 3 బ్లాక్ లో మొదటి అంతస్తు లో నివాసం ఉంటున్న ఇంచార్జి, చిరునవ్వుతో అందరినీ పలకరించే, ఫేస్ వన్ లోని స్థానిక సమస్యలపై పట్టు, అవగాహన ఉన్న, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరు భరత్ కి ముఖ్యుడు రాజేశ్వర్ రెడ్డి పుట్టినరోజు బుధవారం (3/6/2026). వారి పుట్టినరోజు వేడుకలను గుర్తుపెట్టుకొని ప్రత్యేక కేక్ తీసుకొని వచ్చి శాలువాతో వారిని ఘనంగా సన్మానించి వారిచే కేక్ కట్ చేపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఫేస్ 1లోని వాసులు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇంత మంది మిత్రుల మధ్య జరిగిన ఈ పుట్టినరోజు వేడుక నాకు ఎప్పటికీ గుర్తుండే రోజు అని అన్నారు.

## వెంకట్ మిల్లెట్స్ జ్యూసెస్ 3వ శాఖ షాపు ఓనర్ వెంకట్‌కి శుభాకాంక్షలు తెలిపిన అమృతం వీర, వారి టీం



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : మధురానగర్ (జూబ్లీహిల్స్ నియోజకవర్గం)డి 121 షాప్ నెంబర్ 5, శ్రీనివాస అపార్ట్మెంట్ అమీర్పేట్ 500038 చిరునామాలో వెంకట్ మిల్లెట్స్ జ్యూసెస్ షాపును ఘనంగా ప్రారంభించారు నిర్వాహకులు వెంకట్. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్వాహకుడు వెంకట్ ఆహ్వాన మేరకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా(హెచ్ఆర్సిఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు(కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు) అమృతం వీర పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమృతం వీర టీం సభ్యులు కస్సే సుధీర్ కుమార్(స్టేట్ ప్రోగ్రాం సెక్రటరీ), చాపల శివ (జిల్లా జాయింట్ సెక్రెటరీ) లు పాల్గొని నూతన షాప్ ని ప్రారంభించిన వెంకట్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.షాప్ నిర్వాహకుడు వెంకట్ కు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు అమృతం వీర ,వారి టీం. ఈ సందర్భంగా అమృతం వీర మాట్లాడుతూ మేము ప్రతిరోజు కేబీఆర్ పార్కు వాకింగ్ కి వెళ్తామని అక్కడ వెంకట్ షాపులో మిల్లెట్స్ తీసుకుంటామని, అలా పరిచయం తో వెంకట్ మాకు దగ్గరయ్యాడని తెలిపారు. ఆ పరిచయం తోనే ఈరోజు (బుధవారం 3/6/2026)నేను ఈ షాప్ కు వచ్చి వెంకట్ కు శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ మా అమ్మ (పి. సుజాత) నాన్న (పి.వెంకట్) ఆశీర్వాదం వల్లనే నేను మూడో బ్రాంచ్ ని ప్రారంభిస్తున్నానని అన్నారు. నాకు అమృతం వీర ఒక అన్నల, అండల ఉన్నారని, తమ్ముడు అని నాకు ఎప్పుడు సంబోధించేవారు అని అన్నారు.

## సిఎన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మోసిన్ ఖురేషి



ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహమత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి పుట్టిన రోజు బుధవారం. ఈ పుట్టినరోజు వేడుకలను వారి క్యాంప్ కార్యాలయంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కటింగ్ చేసి, శాలువాలు, పూలబొకేలతో మాజీ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డిని ఘనంగా సత్కరించారు. నాయకులు, అభిమానులు పెద్దఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోసిన్ ఖురేషి హాజరై శాలువాతో సిఎన్ రెడ్డిని ఘనంగా సన్మానిం చారు. అనంతరం సి.ఎన్. రెడ్డి మాట్లాడుతూ, తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విడుదలకు ముందే పెద్ది రికార్డులు





## వన్ మిలియన్ క్లబ్‌లో చేరిక

భారీ అంచనాలతో రానున్న 'పెద్ది' విడుదలకు ముందే రికార్డులు నెలకొల్పుతోంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే జూన్ 3న విడుదల కానుంది. అక్కడ ప్రీ బుకింగ్స్ ఓపెన్ కాగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. దీంతో ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వన్ మిలియన్ క్లబ్‌లోకి చేరింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత ప్రీమియర్స్ లోనే చరణ్‌కు ఇదే వన్ మిలియన్ మార్క్ సినిమాగా తెలుస్తోంది. మరోవైపు చిత్రబృందం ప్రచార జోరు పెంచింది. తాజాగా బుచ్చిబాబు ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. చరణ్ ఎంతో కష్టపడ్డారని అన్నారు. పెద్ది అందరి గుండెల్లో ఎప్పటికీ ఉండిపోతాడని చెప్పారు. అందుకు కారణం రామ్‌చరణ్ ఆ పాత్రలో ఒదిగిపోయిన విధానమేనన్నారు. కుస్తీ సన్నివేశాల్లో దెబ్బలు తగిలినా లెక్క చేయకుండా నటించారని ప్రశంసించారు. కంటికి గాయం అయినప్పుడు చిరంజీవి ఏమంటారో అని తనకు భయమేసిందని చెప్పారు. చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో జగపతి బాబు, శివరాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు.

## రామ్‌చరణ్ ఖాతాలో పెద్ది విజయం పడేనా బుచ్చిబాబు సెంటిమెంట్‌ను బద్దలు కొట్టేనా

సంక్రాంతి తర్వాత తెలుగు సినీ పరిశ్రమ ఓ మంచి విజయవంతమైన చిత్రం కోసం ఎదురుచూస్తోంది. మరి రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' ఆ లోటును భర్తీ చేస్తుందా అని ఇప్పుడు అంతా ఎదురు చూస్తున్నారు. 'పెద్ది' సక్సెస్ అందరికన్నా రామ్‌చరణ్‌కు చాలా ముఖ్యం. ఎందుకంటే 'రంగస్థలం' తర్వాత ఆ స్థాయి నటన, విజయం అందించిన చిత్రమేదీ ఆయన నుంచి రాలేదు. 'వినయ విధేయ రామ', 'ఆచార్య', 'గేమ్ ఛేంజర్' అన్నీ చేదు అనుభవాన్ని ఇచ్చినవే.




మధ్యలో వచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' చరణ్‌ను గ్లోబల్‌స్టార్ చేసినా అది రాజమౌళి, ఎన్టీఆర్‌లతో కలిసి షేర్ చేసుకునే విజయమే అవుతుంది. ఈ క్రమంలో చరణ్ ఆశలన్నీ 'పెద్ది' పైనే. 'మస్స మస్స' సాంగ్ చూస్తేనే అర్థమవుతోంది ఈ మూవీ కోసం చరణ్ ఎంత కష్టపడ్డారో. 'ఇలాంటి కథ కోసం కాకపోతే ఇంకెప్పుడు కష్టపడతా'మని కూడా చెప్పారు. చెర్రీకి 'పెద్ది'పై ఉన్న నమ్మకం అలాంటిది. ఇప్పటికే సుకుమార్‌తో మూవీ ప్రకటించారు. ఎంతలేదన్నా ఈ మూవీ రావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. దీంతో చరణ్ హిట్ కొట్టక తప్పని పరిస్థితి.తెలుగు సినీ ఇండస్ట్రీలో దర్శకులను ద్వితీయ విఘ్నం వెంటాడుతూనే ఉంటుంది. ఫస్ట్ మూవీ హిట్ కొట్టి, రెండో మూవీ ఫ్లాప్ అందుకున్న దర్శకులు చాలామందే ఉన్నారు. దాన్ని బద్దలు కొట్టి విజయాన్ని అందుకున్నవారు తక్కువ. 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించడమే కాదు, అవార్డులను కొల్లగొట్టారు బుచ్చిబాబు. దాదాపు ఐదేళ్లుగా 'పెద్ది' కథతో ప్రయాణం చేసి, ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇండస్ట్రీ సెంటిమెంట్‌ను బద్దలు కొట్టడానికి ఈ విజయం బుచ్చిబాబుకు తప్పనిసరి. శ్రీదేవి తనయగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా, ఇప్పటివరకూ బ్లాక్‌బస్టర్ విజయం మాత్రం జాన్వీకపూర్ ను వరించలేదు. తెలుగులో 'దేవర'తో ఎంట్రీ ఇచ్చినా, ఆ పాత్రకు పెద్ద గుర్తింపు రాలేదు. ఇప్పుడు పెద్దిలో 'అచ్చియ్యమ్మ'గా ఆమె కనిపించనున్నారు. జాన్వీ కారణంగానే ఈ మూవీకి కళ వచ్చిందని ఇప్పటికే బుచ్చిబాబు చెప్పారు. మరి జాన్వీ కెరీర్‌కు 'పెద్ది' టర్నింగ్ పాయింట్ కావాల్సిందే. ఏఆర్ రెహమాన్.. ఆస్కార్‌ను సైతం అందుకున్న గొప్ప సంగీత దర్శకుడు. తమిళ, హిందీ భాషల్లో ఆయన అందించిన సంగీతం, పాటలు తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కానీ, తెలుగులో ఆయన నేరుగా చేసిన సినిమాలేవీ మ్యూజిక్‌పరంగా మెప్పించలేకపోయాయి. 'చికిరి' సాంగ్‌తో ఆ అనుమానాలను పటాపంచలు చేశారు. ఆ తర్వాత 'రయ్ రయ్ రారా', 'హల్లో హల్లల్లో' అలరించాయి. ఇక 'మస్స మస్స' ఆ అంచనాలను పెంచింది. వీటన్నింటికన్నా అసలు చూడాల్సింది నేపథ్య సంగీతం. స్పోర్ట్స్ డ్రామా, బలమైన భావోద్వేగాలు కలిగిన ఇందులోని సన్నివేశాలు ఎలివేట్ కావాలంటే అందుకు సంగీతం వారధి అవుతుంది. వీరే కాదు, గౌర్నాయుడు పాత్రపై శివరాజ్‌కుమార్, అప్పలసూరి పాత్రపై జగపతిబాబు, రామ్ బుచ్చి పాత్రపై దివ్యేందు చాలా ఆశలే పెట్టుకున్నారు.

## నేడు పెద్ది మూవీ విడుదల రమ్‌చరణ్‌కు పవన్ శుభాకాంక్షలు

రామ్ చరణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదరుచూసిన రోజు వచ్చేసింది. మరికొన్ని గంటల్లో ప్రీమియర్లతో.. 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సెలబ్రిటీలు విషెస్ చెబుతున్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'పెద్ది' టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ మేరకు తన సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన రామ్ చరణ్ .. పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులతో 'పెద్ది' సినిమా అన్ని ఆటంకాలను దాటుకొని విజయం సాధించాలని పవన్ ఆకాంక్షించారు. చిన్నప్పుడు రామ్ చరణ్‌ను ఆయన ఆశీర్వదిస్తున్న ఫొటోతో ప్రారంభమైన ఓ వీడియోను 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' షేర్ చేసింది. ఈ వీడియోను రీ షేర్ చేసిన చరణ్.. 'మీ మాటలు నాకు, పెద్ది టీమ్‌కు ఎంతో విలువైనవి. మాపై మీకున్న ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. మరోవైపు, పవన్ సతీమణి అన్నా కొణిదెల కూడా 'పెద్ది' టీమ్‌కు విషెస్ చెప్పారు. ఈ మూవీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సినిమా మొత్తానికి దిల్లీ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని మొదటి నుంచీ టీమ్ చెబుతూనే ఉంది. తాజాగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోస్ట్ పెట్టారు. దిల్లీ ఎపిసోడ్ మొత్తం భావోద్వేగాలతో, మాస్ యాక్షన్‌లతో నిండిపోతుందని చెప్పారు. బుచ్చిబాబు ఈ సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారని తెలిపారు. తాను ఈ సినిమాలో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆ ఎపిసోడ్ షూటింగ్‌లో రామ్ చరణ్‌తో కలిసి దిగిన ఫొటోలను జానీ మాస్టర్ పంచుకున్నారు.

# సిఎం విజయ్‌తో ఖుష్బూ సుందర్ కుటుంబం భేటీ

## కుమార్తె అవంతిక పెళ్లికి ఆహ్వానం అందచేత


ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బూ సుందర్, ఆమె భర్త, ప్రముఖ సినీ దర్శకుడు సుందర్ సి. తమ కుమార్తె అవంతిక వివాహ వేడుకకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి విజయ్ నివాసానికి వెళ్లిన ఖుష్బూ దంపతులు, తమ కుమార్తె అవంతిక, కాబోయే అల్లుడు శ్రవణ్ శ్రీనివాసన్ ల వివాహ పత్రికను ఆయనకు అందజేసి ఆశీస్సులు కోరారు. ఈ ప్రత్యేక కలయికకు సంబంధించిన వివరాలను, ఫోటోలను ఖుష్బూ సుందర్ తన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ రోజు తమ కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైనది అని పేర్కొన్న ఖుష్బూ.. ముఖ్యమంత్రి విజయ్‌ను తన ప్రియమైన సోదరుడిగా అభివర్ణించింది. విజయ్‌ను చూడటం ఎల్లప్పుడూ ఉంటుందని. తమ పిల్లలు కూడా విజయ్‌ను చూసి ఎంతో ఆనందించారని, ఆయన ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నప్పటికీ ఎప్పటిలాగే ఎంతో ఆప్యాయతతో, చిరునవ్వుతో తమను స్వాగతించారని ఆమె రాసుకొచ్చింది. ఈ సందర్భంగా తమకు ఎంతో విలువైన



సమయాన్ని కేటాయించి, ప్రేమను, ఆశీస్సులను అందించినందుకు ముఖ్యమంత్రి విజయ్‌కు ఖుష్బూ తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో సినీ రంగంలో కలిసి ప్రయాణించిన వీరిద్దరి మధ్య ఉన్న ఆత్మీయ బంధం, విజయ్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ అలాగే కొనసాగడం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఖుష్బూ కుటుంబం విజయ్‌తో దిగిన ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

Mana Cinemalu

## ఇరుమడి తాజా గ్లింప్స్ విడుదల




మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి'ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన ఎమోషనల్ బాండింగ్ చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాగుడికి బానిసైన తండ్రి ఆ వ్యసనానికి దూరమవ్వడం కోసం అయ్యప్ప మాలా వేసిన అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. అయ్యప్ప స్వామి భక్తి, అయ్యప్ప మాల నేపథ్యంతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆధ్యాత్మికత, ఫ్యామిలీ ఎమోషన్స్ సమానంగా ఉండేలా రవితేజను ఒక సరికొత్త రిఫ్రెషింగ్ అవతార్‌లో చూపించబోతున్నాడు శివ నిర్వాణ. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, ఇతర కీలక పాత్రల్లో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జులై లేదా ఆగస్టు 2026లో భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

## డాన్ -3 వివాదానికి తాత్కాలిక తెర

### రణ్‌వీర్ లీగల్ నోటీసులు.. నిషేధం ఎత్తివేసిన నిర్మాణ సంస్థ



బాలీవుడ్‌లో చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం రోజురోజుకూ ముదురుతోంది. తాజాగా ఈ వివాదం కోర్టు మెట్లెక్కింది. తనపై నిషేధం విధించిన ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థకు మంగళవారం రణ్‌వీర్ లీగల్ నోటీసులు పంపారు. మరోవైపు తమకు నోటీసులు అందినట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ ధ్రువీకరించారు. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ మధ్యలో వైదొలిగారు. ఈ క్రమంలో.. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై నటుడి టీమ్ స్పందిస్తూ.. ఆయనకు వృత్తిపై అపారమైన గౌరవం ఉందని తెలిపింది. సినిమా హిట్ కావాలని కోరుకుంటారని అందుకే ఈ వివాదంపై మౌనంగా ఉంటున్నారని వెల్లడించింది. ఈక్రమంలో బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌కు పెద్ద ఉపశమనం లభించింది. ఆయనపై విధించిన నాన్-కోఆపరేషన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ బుధవారం ప్రకటించింది. ఫర్హాన్ అక్తర్ సినిమా 'డాన్ 3' నుండి రణవీర్ తప్పుకోవడంతో ఈ వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రణవీర్ సింగ్ సదరు సంస్థకు లీగల్ నోటీసు పంపిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ , ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, మరియు సినీ / టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ లు ఈ గొడవలో జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో సమస్య సర్దుమణిగినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ప్రెసిడెంట్ బి.ఎన్. తివారీ మాట్లాడుతూ.. సినీ అసోసియేషన్ల అభ్యర్థన మేరకు రణవీర్ సింగ్‌పై ఉన్న నాన్-కోఆపరేషన్ ఆదేశాలను వెంటనే రద్దు చేస్తున్నాం. నిర్మాతలు, దర్శకులు లేదా నటులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందరం కలిసి కూర్చుని మాట్లాడుకుంటాం. ఈ గొడవలో ఎవరూ గెలవలేదు, ఎవరూ ఓడిపోలేదు. రణవీర్ పంపిన నోటీసుకు మా లీగల్ టీమ్ సమాధానం ఇస్తుంది అని చెప్పారు.